జిల్లాలో నేడు



షాద్‌నగర్ ఏఎంసీ ప్రమాణ స్వీకారం

హాజరు కానున్న మంత్రులు తుమ్మల, జూపల్లి



సులోచన, చైర్‌పర్సన్



బాబార్‌ఖాన్, వైస్ చైర్మన్

షాద్‌నగర్, నవంబరు 26: (ఆంధ్రజ్యోతి): నేడు షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం చేయనుంది. ఉదయం 10 గంటలకు షాద్‌నగర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగనుంది. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సులోచన, వైస్ చెర్మన్ బాబర్ ఖాన్ మాట్లాడుతూ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారికి ఈ పదువులు లభించినందుకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సుమారు 60 ఎకరాల్లో నిత్యం సాగు

అన్ని కాలాల్లోనూ విరివిగా లభిస్తున్న పుదీనా

నగరంలోని గుడిమల్కాపూర్ మార్కెట్‌కు తరలింపు

ప్రతీరోజు ఆదాయంతో రైతుల్లో ఆనందం

పుదీనా @ మల్కాపూర్



పొలంలో పుదీనా మూట కడుతున్న రైతు

పండగలు, పబ్బాలు, శుభకార్యాలు.. ఫంక్షన్ ఏదైనా కచ్చితంగా 'పుదీనా' ఉండాల్సిందే. ధర ఎంతైనా వంటల్లో పడాల్సిందే. అటువంటి పుదీనాకు కేరాఫ్‌గా మారింది ఆ గ్రామం. ఆ పల్లెలోని ప్రతీ రైతు ఎంతో కొంత విస్తీర్ణంలో విధిగా పుదీనా సాగు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. నగరంలోని గుడిమల్కాపూర్ మార్కెట్‌కు వచ్చే పుదీనాలో 80 శాతం ఆ గ్రామంలో పండించినదే. నిత్యం పుదీనా మూటలను మార్కెట్‌కు తరలిస్తూ లాభాలు గడిస్తున్నారు. అధిక మొత్తంలో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న చేవెళ్ల మండలంలోని మల్కాపూర్‌పై ప్రత్యేక కథనం.

ఆ గ్రామంలో 70శాతం మందికి ఈ పంటే ఆధారం



మల్కాపూర్‌లో సాగుచేస్తున్న పుదీనా పంట

చేవెళ్ల, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): పుదీనా సాగుతో అన్ని కాలాల్లోనూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు మండలంలోని మల్కాపూర్ గ్రామ రైతులు. హైదరాబాద్ నగరంలోని గుడిమల్కాపూర్ మార్కెట్‌లో పుదీనా గ్రామంగా మల్కాపూర్ పేరుగాంచింది. గ్రామంలో బోరు, బావులు ఉన్న ప్రతీ రైతు తప్పని సరిగా పుదీనా పండిస్తారు. గ్రామంలో మొత్తం 800 ఎకరాల సాగు భూమి ఉండగా ఇందులో సుమారు 60 ఎకరాలో పుదీనా పంటను సాగు చేస్తుంటారు. ఇక్కడున్న 1,200 కుటుంబాల్లో 70 శాతం మంది పుదీనా పంట సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సీజన్ ఏదైనా పుదీనా పంటను సాగు చేసి మంచి లాభాలను అర్జిస్తున్నారు.

80శాతం ఆ గ్రామం నుంచే..

మల్కాపూర్ గ్రామంలోని రైతులు సాగు చేసిన పుదీనా పంటకు నగరంలోని గుడిమాల్కాపూర్ మార్కెట్‌లో ఓ ప్రత్యేకత ఉంది. మార్కెట్‌లో 80 శాతం పుదీనా

మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వం రాయితీ ఇవ్వాలి



ఆకు కూరలతో పాటు పుదీనా పండించే రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహించడంతోపాటు సబ్సిడీ అందించాలి. గ్రామంలోని చాలా మంది రైతులు బోరు, బావుల వద్ద పుదిన పంటనే అధికంగా సాగు చేసి జీవనం సాగిస్తున్నారు. పెద్దగా లాభాలు రాకపోయినా ప్రతీ రోజు పొలం వద్ద పని దొరుకుతుంది. మార్కెట్‌లో ధరలు ఉన్నపుడు మంచి లాభాలే వస్తాయి.

-గోపాల్‌రెడ్డి, యువ రైతు

గజగజ



పంజా విప్పిన చలిపులి

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

మోమిన్‌పేటలో 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాను చలి వణికిస్తోంది. ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు సైతం గణనీయంగా పడిపోతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. గ్రామాల్లో సాయంతం 5.30 గంటల నుంచి చల్లగాలులు వీస్తున్నాయి. దీంతో చలి నుంచి ఉపశమనం పొందేందుకు చలి మంట వేసుకుంటున్నారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో మంగళవారం అత్యల్పంగా 9.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లాలో 10.4 డిగ్రీలు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లిలో 12.2 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంచాలి

- ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 26 : విద్యార్థులు అన్ని రంగాలలో ముందంజలో ఉంటారనే నమ్మకాన్ని ఉపాధ్యాయులే కల్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. మంగళవారం తుక్కుగూడలో ఏర్పాటు చేసిన జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని, విద్యానాణ్యత పెంచేలా కృషి చేయాలని తెలిపారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పాత్ర ముఖ్యమైనదన్నారు. వారు పాఠశాల నడపడంలో నిబద్ధత, అంకితభావం, అలసత్వం లేకుండా పని చేసినప్పుడే ఆ పాఠశాల అగ్రస్థానంలో ఉంటుందన్నారు. ప్రైవేటుకు దీటుగా పాఠశాలల విలువలను పెంచాలన్నారు. పాఠశాలలు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం పథకంలో నాణ్యమైన ఆహారం, సురక్షితమైన నీటిని అందించాలన్నారు. విధి నిర్వహణ పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఎంఈవోలు, ప్రధాన పాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

రంగాపూర్, చీదేడ్‌లలో అభివృద్ధి పనులు ప్రారంభం

7



ఆలయాల వద్ద నిఘా పెంచాలి

విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

7

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

పూజారులు, ఇమాంలు, పాస్టర్లతో సమావేశం



119 మందికి కంటి ఆపరేషన్లు

ఐక్యతా పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

8

ఆమనగల్లులో ఉచిత కంటి వైద్య శిబిరం

శిబిరంలో 4,500 మందికి పరీక్షలు





సర్దార్‌నగర్ వైకుంఠధామం వద్ద ఢిల్లీ అధికారుల బృందం

సర్దార్‌నగర్‌లో ఢిల్లీ అధికారుల బృందం

- నర్సరీ, వైకుంఠధామం, ప్లాంటేషన్ పరిశీలన

షాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని ఢిల్లీకి చెందిన 12 మంది అధికారుల బృందం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీలో జరుగుతున్న ఆన్‌లైన్ సేవలు రికార్డుల నిర్వాహణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి నిధుల సమీకరణ, రాష్ట్ర నిధుల నిర్వహణ, ఉపాధిహమీ నిధులతో చేపట్టిన పనులను వారు పరిశీలించారు. గ్రామంలోని నర్సరీ, సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం, వైకుంఠధామం, ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం సర్దార్‌నగర్ సంత జరుగుతున్న తీరును గమనించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేశ్‌మోహన్, ఎంపీడీఓ అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

రైతు, కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఆమనగల్లు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు, కార్మిక సమస్యలను పరిష్కరించాలని, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు కానుగుల వెంకటయ్య డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఆయనతో పాటు సీఐటీయూ ఏరియా కన్వీనర్ జిల్లెల్ల పెంటయ్య, కేయూపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ చెన్నయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ ఉన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఈ మేరకు రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాజీవ్ చౌక్‌వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించి నిర్వీర్యం చేయడానికి కేంద్రం కుట్ర చేస్తుందని ఆరోపించారు. బీమా పేరుతో ప్రీమియం డబ్బులు కట్ అవుతున్నా బీమా సొమ్ము అందడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన బోనస్‌ను వెంటనే రిలీజ్ చేయాలని కోరారు. ఈజీఎస్ పని దినాలు 200ల రోజులకు పెంచి, కూలి రూ. 600 అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కురుమయ్య, పోచయ్య, శంకర్, పవన్, సీఐటీయు మండల నాయకులు సురేందర్, జహంగీర్, హంసమ్మ, రాములు, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఏవో నర్సింహారావు

యాసంగిలో ఆరుతడి పంటలు మేలు

జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు

కందుకూరు, నవరంబరు 26(ఆంధ్రజ్యోతి): యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు రైతులకు సూచించారు. మంగళవారం కందుకూరు రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. వరి పంటను కోతల తర్వాత జీరో టిల్లేజ్(దుక్కులు దున్నకుండా) పద్ధతిలో వరి కోయ్యల్లో నీటిని పెట్టి మొక్కజొన్న విత్తనాలను వేయాలని సూచించారు. దీంతో రైతులకు దుక్కి దున్నడానికి అయ్యే ఖర్చు తగ్గుతుందని ఆయన సూచించారు .అలాగే వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించి పంటలను సాగుచేస్తే అధిక దిగుబడి సాధిస్తారని ఆయన సూచించారు. ప్రధానంగా పామాయిల్ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుధారాణి, కృష్ణమోహన్, ఉద్యనవన అధికారి సౌమ్య, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు రాజు, జగదీశ్వర్‌చారి, రామవేంద్రచారి, శ్రీహరి, నమీయొద్దీన్, నర్మద, రైతులు పాపిరెడ్డి, జి.సురేందర్‌రెడ్డి, ఐలయ్య తదితరులున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత



నాటుకోళ్ల షెడ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న డీఆర్డీవో శ్రీలత

ఇబ్రహీంపట్నం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వ్యవసాయ అనుబంధ యూనిట్లకు ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందజేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 21 నాటుకోళ్ల యూనిట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిధి ఎలిమినేడులో లబ్ధిదారు బుట్టి రాధికకు చెందిన నాటు కోళ్ల షెడ్డు నిర్మాణం పనులను ఆమె ప్రారంభించారు. ఒక్కో యూనిట్‌కు బ్యాంకు లింకేజీ కింద రూ.75వేలు రుణంగా ఇస్తుండగా.. షెడ్డు నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.2.99 లక్షలు మంజూరు చేస్తున్నట్లు డీఆర్డీవో తెలిపారు. అలాగే బ్యాంకు లింకేజీ కింద పాడి పశువులు కొనుగోలు చేసిన ఎస్ఎస్‌జీ మహిళలకు మండలానికి 10 చొప్పున పశువుల పాకలను మంజూరు చేశామని, ఒక్కో పాకకు రూ.86 వేలు అందజేస్తామన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎక్కువ రోజులు ఉపాధిహామీ పనులు చేసిన కవితను, మొక్కల పెంపకంలో శ్రద్ధచూపిన గణేష్‌ను, పారిశుధ్య కార్మికురాలు రాములమ్మలను డీఆర్డీవో సన్మానించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకాధికారి నవీన్‌రెడ్డి, ఏపీడీలు నరేందర్‌రెడ్డి, సూర్యారావు, ఎంపీడీవో వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్

కేశంపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మామిడిలో పూత దశ నుంచి సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్ సూచించారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి రైతుల వేదికలో మంగళవారం మామిడితోటలో పూత దశలో తీసుకోవలిసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పూత రాలకుండ అధికారుల సూచన ప్రకారం మందులు వాడాలని సూచించారు. అలాగే తోటకు తరుచు నీటిని వదలాలని సూచించారు. అప్రభుత్వం ఇచ్చే రాయితీతో ఆయిల్ పామ్, మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకం పెద్ద ఎత్తున సాగు చేయాలని సూచించారు. అయిల్ పామ్ సాగుకు 90 శాతం నుంచి 100 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందని వివరించారు. మూడేళ్లలో పామాయిల్ కోతకు వస్తుందని తెలిపారు. కంపెనీలు రైతులనుంచి నేరుగా అయిల్ పామ్ కొనుగోలు చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కృషి విజ్ఞన కేంద్రం శాస్త్రవేత్త శ్రీకృష్ణ, ఉద్యానవన అధికారిణి హిమబిందు, ఏవో శిరీష, వాల్యూ ఆయిల్ కంపెనీ జిల్లా మేనేజర్ ప్రమోద్, అయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ రుక్మిణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు పెద్దపీట

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగు పరిచి పేదల జీవన ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కోనాపూర్‌లో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధీహామి పథకం కింద రూ.80 వేలతో నిర్మించే పశువుల షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి భూమిపూజ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ చైర్మన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, స్పెషలాఫీసర్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో మాధురి, ఏపీవో మాధవరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, ప్రధానకార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, తదితరులున్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఓ కన్సల్టెన్సీ కార్యాలయంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన కడ్తాల మండలం టాక్‌రాజ్‌గూడ తండాకు చెందిన న్యాయవిద్యార్థిని ఇస్లావత్ శ్రావ్య కుటుంబాన్ని మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శించారు.

క్రైస్తవ మైనార్టీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 2024 క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వం మత పెద్దలు, సంస్థలను సత్కరించనుందని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి మంగళవారం కె.వీణ తెలిపారు. జిల్లాలో 30ఏళ్లుగా సామాజిక సేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలు, పదేళ్లుగా సేవలందిస్తున్న క్రైస్తవ మిషనరీలు నామినేషన్లు డిసెంబరు 5లోగా తమ కార్యాలయంలో.. రూం నంబర్ ఎస్-2, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్, అంతాయపల్లి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అడ్రెస్‌కు పంపాలన్నారు. దరఖాస్తు ఫామ్ వెబ్‌సైట్‌లో లేదా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ అల్పసంఖ్యాక వర్గాల ఆర్థిక సహాయ సంస్థ, గృహకల్ప భవన్, 2వ అంతస్తు, ఎంజే రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో పొందొచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు 040-23391067 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యులు

తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రెసిడెన్షియల్ స్కూల్‌లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తాండూరు జిల్లా ఆసుపత్రి వైద్యురాలు రుబియానాజ్ అన్నారు. మంగళవారం ఐనెల్లిలోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. ప్రిన్సిపాల్ వినోద్‌ఖన్నాతో మాట్లాడుతూ విద్యార్థులకు ఏమైనా ఆరోగ్య సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 430మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు చర్మవ్యాధులు, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జినుగుర్తి పీహెచ్‌సీ వైద్యులు రాధ, కృష్ణవేణి, కరుణ, టీచర్లు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ విధానంతో ఉద్యోగాలు



నారాయణరెడ్డి, ఎస్పీ

వికారాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా భరోసా సెంటర్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేసేందుకు మూడు ఉద్యోగాలు ఉన్నాయని ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. మహిళా అభ్యర్థులు జిల్లా పోలీస్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెంటర్ కోఆర్డినేటర్ ఒక పోస్టు, సపోర్ట్ పర్సన్ రెండు పోస్టులున్నాయని తెలిపారు. ఉద్యోగాల కాల వ్యవధి ఏడాదని పేర్కొన్నారు. అవసరం మేరకు పొడిగించే అవకాశం ఉంటుందన్నారు. బయోడేటా, సర్టిఫికెట్ కాపీలను జిల్లా పోలీసు కార్యాలయానికి ఈ-మెయిల్ చేయొచ్చని లేదా 8712670063 నంబర్‌కు వాట్సాప్ చేయొచ్చని తెలిపారు. కోఆర్డినేటర్‌కు ఎంఏ ఎంఎస్‌సీ, సైకాలజీ విద్యార్హత, రెండేళ్ల సర్వీసు అనుభవం ఉండాలన్నారు. జీతం రూ.30వేలు ఉంటుందన్నారు. సపోర్ట్ పర్సన్ పోస్టుకు మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్(ఎంఎస్‌డబ్ల్యూ), ఏడాది సర్వీసు అనుభవం ఉండాలన్నారు. జీతం రూ.20వేలు ఇస్తారని ఎస్పీ వివరించారు.

బాల్య వివాహాలతో మహిళల ఆరోగ్యానికి ముప్పు



మాట్లాడుతున్న న్యాయాధికారి శీతల్

వికారాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో మహిళల ఆరోగ్యం క్షీణిస్తుందని, అలాగే వారికి పుట్టిన పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉండలేరని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి డీబీ.శీతల్ అన్నారు. మంగళవారం బూర్గుపల్లిలోని గురుకుల పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ పెళ్లివయసు వచ్చిన తరువాతే వివాహం చేసుకోవాలని సూచించారు. కాలేజీల్లో ర్యాగింగ్ కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారుతోందని, ఇలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడపొద్దు

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీనాయక్



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీనాయక్

చేవెళ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నంబర్‌ప్లేట్ లేకుండా రోడ్లపై వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంబర్‌ప్లేట్స్ లేకుండా రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈమేరకు 17 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సీఐ ఎస్.వెంకటేశం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రానివి రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు



నిరసన ర్యాలీలో కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని రైతు సంఘం జిల్లా నాయకుడు కానుగుల వెంకటయ్య, సీఐటీయూ ఏరియా కన్వీనర్ జిల్లెల్ల పెంటయ్య, కేయూపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ చెన్నయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్‌లు ఆరోపించారు. జాతీయ ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించి నిర్వీర్యం చేయడానికి కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం రైతు, కార్మిక సమస్యలను పరిష్కరించాలని, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్‌వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బైటాయించి నిరసన, ధర్నా చేపట్టారు. మున్సిపల్ కార్మికులతో కలిసి నాయకులు ర్యాలీ చేపట్టారు. ప్రజా సంఘాల నాయకులు కురుమయ్య, పోచయ్య, శంకర్, పవన్, సీఐటీయూ మండల నాయకులు సురేందర్, జహంగీర్, హంసమ్మ, రాములు, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంస్థకు కార్మికులే పట్టుగొమ్మలు



పురస్కారం అందుకున్న ఆర్టీసీ కార్మికులు

మేడ్చల్ టౌన్, నవంబరు(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ కార్పోరేషన్ అభివృద్ధికి కార్మికులే పట్టుకొమ్మలని, సంస్థ నడిచేలా కృషిచేయాల్సిన బాధ్యత ప్రతీ కార్మికుడిపై ఉందని మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ అన్నారు. ప్రగతి చక్రాల పురస్కారంలో భాగంగా మంగళవారం డిపోలో డ్రైవర్, కండక్టర్లను సన్మానించారు. అక్టోబరులో ఇంధనం ఆదా చేసిన డ్రైవర్లకు, ఇన్సెంటివ్ పొందిన కండక్టర్లకు బహుతి అందజేశారు. కార్మికులు కష్టపడి పనిచేసి సంస్థకు మరింత గుర్తింపు తేవాలని డీఎం కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాల పనుల బిల్లుల్లో కోత!

- పనులకు వెచ్చించింది రూ.2.50లక్షలు
- ఎంబీ రికార్డులేమో రూ.1.37లక్షలకే
- న్యాయం చేయాలంటున్న మహిళ



పాఠశాలలో నిర్మించిన సెప్టిక్ ట్యాంక్ గుంతలు



ట్యాంకు నుంచి వేస్తున్న పైప్‌లైన్(ఫైల్)

ధారూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాల స్కీం కింద పనులు చేసిన ఓ మహిళకు సరిగ్గా బిల్లు రికార్డు చేయక ఇబ్బందులు పడుతున్నారు. రూ.2.50లక్షలతో పాఠశాలలో పనులు చేయిస్తే రూ.1.37లక్షలకే ఇంజినీరింగ్ అధికారులు ఎంబీ రికార్డు చేశారని సదరు మహిళ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. స్టేషన్ ధారూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పనులకు రూ.4.4లక్షలు కేటాయించారు. పనులను వాణిశ్రీ(మార్కెట్ కమిటీ డైరెక్టర్) చేశారు. గ్రామంలోని నీటి ట్యాంకు నుంచి స్కూల్ ట్యాంకులకు 350ఫీట్ల పైప్‌లైన్ వేయించారు. ఆరు గదుల్లో కరెంటు పనులు, మరుగుదొడ్లలో రెండు సెప్టిక్ ట్యాంక్‌లకు గుంతలు, కొత్తగా కుండీలు, టైల్స్, వాటర్ పైప్ లైన్, నల్లాల బిగింపు, కిటికీలు ఏర్పాటు, కిచెన్ షెడ్‌లో ఫ్లోరింగ్, గ్యాస్ పైప్‌లైన్ తదితర పనులకు రూ.2.5లక్షలు ఖర్చు చేశారు. అయితే ఇంజినీరింగ్ అధికారులు రూ.1.37లక్షలకే ఎంబీ రికార్డు చేశారు. ఇప్పటి వరకు 1.21లక్షలు మాత్రమే డ్రాచేయగా మిగతా డబ్బుకోసం, వాస్తవ బిల్లు రికార్డు కోసం ఆమె అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

పనులు చేసినా ఎంబీ రికార్డు చేయలేదు



పాఠశాలలో గుర్తించిన పనులన్నీ నాణ్యతగా చేయించాను. పనులకు రూ.2.50లక్షలు ఖర్చు చేశాను. అధికారులు ఎంబీ రికార్డుల్లో రూ.1.37లక్షలకే చేయడంతో పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంది. జూన్‌లో వెంటపడి పనుల చేయించిన అధికారులు బిల్లు మాత్రం న్యాయంగా చేయలేదు. లేదంటే అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి నాకు జరిగిన అన్యాయంపై వివరిస్తా. - వాణిశ్రీ, పాఠశాల పనులు చేసిన మహిళ

పట్టుబడిన వాహనాల వేలం నేడు

శంషాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్-శంషాబాద్ పరిధిలో గతంలో డ్రగ్స్ (గంజాయి) అక్రమ రవాణాలో వినియోగించి పట్టుబడిన వాహనాలను నేడు(బుధవారం) వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌రావు ప్రకటనలో పేర్కొన్నారు. పట్టుబడిన ద్విచక్ర వాహనం, త్రిచక్ర వాహనం(ఆటో)నకు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

కడ్తాల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ఆమనగల్లు ఏడీఏ ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏవో శ్రీలతతో కలిసి సందర్శించారు. 17లోపు తేమ శాతం ఉండేట్లు ఆరబెట్టుకోవాలని సూచించారు. ఏఈవోలు రమేశ్, అభినవ్, అనూష, వందన ఉన్నారు.

ఆలయాల వద్ద నిఘా పెంచాలి

షాద్‌నగర్‌రూరల్/ఆమనగల్లు/తలకొండపల్లి/కేశంపేట,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆలయాల వద్ద నిఘాను పటిష్ఠం చేసుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి తెలిపారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం షాద్‌నగర్ పట్టణంతో పాటు ఫరూఖ్‌నగర్ మండలంలోని ప్రార్థనా మందిరాలు, మసీదులు, చర్చీల పూజారులు, ఇమాంలు, పాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ పరిధిలో 113 మందిరాలు ఉన్నాయని, ప్రతీ ప్రార్థనా మందిరానికి తాళంవేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డోర్లు పటిష్ఠంగా ఉండటంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు తదితరులున్నారు. అలాగే ఇటీవల ఆలయాలపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని ప్రతీ దేవాలయం దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ కోరారు. ఆమనగల్లు స్టేషన్ ఆవరణలో వివిధ మతాలు, వర్గాలకు చెందిననాయకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై బి.వెంకటేష్, నాయకులు తదితరులున్నారు. నేర నియంత్రణ, పరిశోధనకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. తలకొండపల్లి మండలంలో భద్రత చర్యల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి రూ.50 వేలు, గట్టిప్పలపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి రూ.10 వేలు, కర్కస్ తండాకు చెందిన శంకర్ రూ.5వేలు, రాజేందర్ నాయక్ రూ.2వేలు సమకూర్చారు. స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌కు అందజేశారు. అన్ని గ్రామాలు, తండాలు , వ్యాపార సముదాయాలు, దేవాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సూచించారు. మోహన్‌రెడ్డి, రవీందర్ యాదవ్, అజీం, కృష్ణ, చెన్నకేశవులు, ఆరిఫ్, రఘురాములు, తదితరులు పాల్గొన్నారు. అలాగే హిందూ, ముస్లిం, క్రిష్టియన్ ఆధ్యాత్మిక కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కేశంపేట ఇన్‌స్పెక్టర్ నరహరి సూచించారు. స్టేషన్‌లో వివిధ మతాలకు చెందిన ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్సై రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నరహరి

ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి



సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహేశ్వరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో దర్గాలు, మసీదుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో ముస్లిం కమ్యూనిటీ హాలు, దర్గా అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని మంగళవారం మహేశ్వరం ముస్లిం కమ్యూనిటీ నాయకులు సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కమ్యూనిటీ హాళ్లు, దర్గాల అభివృద్ధికి త్వరలో నిధులు విడుదల చేయిస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు ఎంఏ సమీర్, హాజీ బాబా తదితరులున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

రంగాపూర్, చీదేడ్‌లలో అభివృద్ధి పనులు ప్రారంభం



చీదేడ్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండలం రంగాపూర్, చీదేడ్ గ్రామాల్లో రూ.36లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, బి.రమాకాంత్‌రెడ్డి, వెదిరె హన్మంత్‌రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, జెనిగె వెంకటేష్‌యాదవ్, జిలమోని సత్తయ్య, జంగయ్యగౌడ్, తదితరులున్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకోవాలి

యాచారం : అధికారులు ప్రతీ సోమవారం ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అయ్యవారిగూడలో రూ.16లక్షలు, చౌదర్‌పల్లిలో రూ.18లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లను ప్రారంభించారు. రుణమాఫీ కాలేదని రైతులు తెలపడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. మీ అడ్మినిస్ట్రేషన్ బాగా లేదని, మీరేం చేస్తున్నారని ఎంపీడీవోను ప్రశ్నించారు. కార్యదర్శిని గ్రామంలోనే ఉండాలని, హైదరాబాద్‌లో ఉంటే ఏం లాభమని ప్రశ్నించారు. మిషన్ భగీరథ అధికారుల తీరుపైనా మండిపడ్డారు. టీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీవో శ్రీలత, పంచాయతీ రాజ్ ఏఈ వంశీ, ఏపీవో లింగయ్య, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి, సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అర్హులకు వర్తింపజేయాలి



బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు వర్తింపజేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని మండలి చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ మార్కెట్ కమిటీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కండ్లకోయలో నిర్వహించిన మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రైతుల రుణమాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ ఏఎంసీ చైర్మన్‌గా నర్సింహులు, డైరెక్టర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బొంగునూరు శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు వస్తారని ప్రచారం జరిగినా వారు రాలేదు. మేడ్చల్, గుండ్లపోచంపల్లిల్లో మంత్రులకు స్వాగతం పలుకుతూ కటౌట్‌లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. చివరికి మంత్రులు రాకపోవటంతో నాయకులు నిరాశ చెందారు. ఒక వర్గానికే చెందిన నాయకులు, కార్యకర్తలు అధికారిక కార్యక్రమాల్లో పెత్తనం చలాయిస్తున్నారని కొందరు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమానికి రాలేదు. డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిలు కార్యక్రమానికి రాకపోవడం చర్చనీయాంశమైంది. మార్కెట్ కమిటీలో పదవులు దక్కలేదని కొందరు సీనియర్లు కినుక వహించారు. అదేవిధంగా కటౌట్లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ ఫొటో లేదని ఆయన అభిమానులు ఫ్లెక్సీని చింపేశారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ



శంషాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. మదన్‌పల్లి పాత తండాలో సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. మదన్‌పల్లి పాత తండాకు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.10లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మాజీ జడ్పీటీసీ తన్వీరాజు, వైస్ఎంపీపీ నీలం మోహన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు

బషీరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్లాపూర్‌లో ఆసరా పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు మంగళవారం పడిగాపులు కాశారు. పంచాయతీ వద్ద సాయంత్రం వరకు నిరీక్షించినా బీపీఎం రాక ఉస్సూరుమంటూ ఇళ్లకు వెళ్లిపోయారు. నెల నెలా పింఛన్ల కోసం ఇదేతంతు నడుస్తోందని వృద్ధులన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి విశాల్ స్పందిస్తూ నెలనెలా కొత్త బీపీఎంలు వస్తుండటంతో ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు.

దేవుని ఎర్రవల్లిని మున్సిపాలిటీలో కలపొద్దు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేవెళ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు కాబోతున్న చేవెళ్ల మున్సిపాలిటీలో దేవుని ఎర్రవల్లి గ్రామాన్ని విలీనం చేయొద్దని ఆ గ్రామస్తులు, పలువురు నాయకులు కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. మంగళవారం గ్రామానికి చెందిన నాయకులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, గ్రామస్తులు కలెక్టరేట్‌లో నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. గత అక్టోబరు 2న గ్రామస్తులందరూ తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. నాయకులు బక్కయ్య, చంద్రయ్య, రాజిరెడ్డి, మల్‌రెడ్డి, సత్యనారాయణ, రవీందర్, తదితరులున్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

మేడ్చల్ టౌన్: మేడ్చల్ ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో నమోదైన కేసుల్లో సీజ్ చేసిన 16 వాహనాలకు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వాహనాలను 18శాతం జీఎస్టీ కలుపుకొని రూ.5.25లక్షలకు వేలం వేశామని ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు.



జాకారంలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ మండలాభివృద్ధికి కృషి

చౌదరిగూడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చౌదరిగూడ మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవ సభ పార్టీ అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు అభివద్ధి చేశాం.. ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే చెబుతున్నారని, ఏవిధంగా ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. చౌదరిగూడెం మండలాభివృద్ధికి ఏం నిధులు వెచ్చించారో తెలపాలన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసినందుకా? అభివృద్ధిని విస్మరించినందుకా ఆదర్శంగా ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లో చేసిన అభివృద్ధిని గ్రామాల్లో కార్యకర్తలు చెప్పాలన్నారు. ఐకమత్యంతో ముందుకుసాగి పార్టీకి అండగా నిలబడాలన్నారు. కార్యకర్లకు ఏ ఆపద వచ్చినా అండగా నిలబడతానన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో రూ.5.37 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. జాకారంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం, అండర్‌డ్రైనేజీ, వాచ్యతండా, దాస్యతండా, గాలిగూడ నుంచి గాంగ్యాతండా వరకు బీటీ రోడ్డు, చౌదరిగూడలో షాదీఖానా, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాల నిర్మాణం, ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల గది నిర్మాణం, లచ్చంపేటలో జీపీ భవనం, అండర్‌డ్రైనేజీ, లాల్‌పహాడ్ చలివేంద్రంపల్లి వరకు వేస్తున్న బీటీ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం చౌదరిగూడలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్, ఏఈ వంశీకృష్ణ, సీనియర్ నాయకుడు బాబర్‌ఖాన్, కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, వెంకటనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు పాటుపడాలి

కడ్తాల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రభుత్వానికి మధ్య మార్కెట్ పాలకవర్గం వారధిగా పనిచేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ నరేశ్ నాయక్‌లకు మంగళవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీనర్సింహారెడ్డి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, నాయకులు లాయక్‌అలీ, లక్ష్మణ్ నాయక్, జహంగీర్‌అలీ, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతాం

కొడంగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్య అన్నారు. మంగళవారం కొడంగల్‌లో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసం ప్రజల స్వాతంత్ర్యాన్ని కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెడుతోందన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు రూ.26వేలివ్వాలని అన్నారు. భోజన కార్మికులకు వేతన విధానాన్ని అమలు చేస్తూ పెండింగ్ బిల్లులను ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలనూ పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో ఉషశ్రీకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆశాల సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు పద్మావతి, సుజాత, రేణుక, యాదమ్మ, ఈశ్వరమ్మ, పంచాయతీ కార్మికులు సుమిత్ర, సద్దాంహుస్సేన్, మొగులమ్మ, శ్రీనివాస్, వెంకటప్ప, సేవ్యానాయక్ పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : పవిత్ర మాలలు తీసుకెళ్తున్న బక్కని నర్సింహులు

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవ పూజలు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండోరోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవ పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో పూజారి శ్రీనివాసచార్యులు, వేద పండితులు మంత్ర హోమం, పవిత్రారోహణం తదితర పూజలు నిర్వహించారు. పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా, పరిగి సాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, కానుగు రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మహేశ్వరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట గ్రామంలో పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. రాష్ట్ర అర్బన్‌ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ఇతర నాయకులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ నర్సింగ్‌పటేల్, ఎంపీటీసీ కుమారి రాయప్ప, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'సింహగర్జన'ను జయప్రదం చేయాలి

కందుకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1న నిర్వహించనున్న సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు కొత్తూరు గ్రామాధ్యక్షుడు పాశం శ్రీనివాస్ కోరారు. మంగళవారం గ్రామంలో ఆ సంఘం నేతలతో కలిసి కరపత్రాలను విడదల చేశారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

- ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం
- అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళి



చేవెళ్ల : అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ఒక విప్లవాత్మక గ్రంథమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, శివశంకర్‌గౌడ్, బాబర్‌ఖాన్, రఘు, అందె మోహన్, బస్వం తదితరులు పాల్గొన్నారు. దళిత నాయకుడు, ఉద్యమకారుడు జాంగారి రవి నేతృత్వంలో షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాలు, రాజకీయ పార్టీలు, కార్మిక సంక్షేమ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ఫరూఖ్‌నగర్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కార్మిక సంక్షేమ సంఘం కన్వీనర్ ప్రభాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు : రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కోనాపూర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మార్కెట్ చైర్‌పర్సన్ గీతానర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, స్పెషలాఫీసర్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో మాధురి, ఏపీవో మాధవరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, ప్రధానకార్యదర్శి బీక్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మార్కెట్ డైరెక్టర్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, నాయకులున్నారు. ఆమనగల్లు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ హాజరయ్యారు. భాస్కర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. శ్రీనివాస్ గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, గూడూరు భాస్కర్‌రెడ్డి, చేగూరి వెంకటేశ్, బీక్యనాయక్, జహంగీర్‌అలీ, లక్ష్మణ్‌నాయక్, అశోక్, నరేశ్ నాయక్, తదితరులున్నారు.

తలకొండపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో శ్రీకాంత్, తహసీల్దార్ నాగార్జున, నాయకులు అజీం, రవీందర్‌యాదవ్, అనిల్, ఆరిఫ్, యాదగిరి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : మండలంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. పలు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం అశోక్ రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుశీల, ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలని చేవెళ్ల అంబేడ్కర్ యుజన సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, చేవెళ్ల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాములు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలువేసి నివాళులర్పించారు. జంగయ్య, ప్రభాకర్, మల్లేష్, రాంచందర్, అరుణ్‌కుమార్, రాజేశ్, తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం : భారత రాజ్యాంగం ప్రపంచ రాజ్యాగాలన్నింటికన్నా సర్వోత్తమమైందని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్‌రావు అన్నారు. కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి జి.రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ భూపతిరాజు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ప్రతీ ఒక్కరు రాజ్యాంగ విలువలను తెలుసుకొని పాటించాలని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం పోచారంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ కృపేష్, మాజీ జడ్పీటీసీ మహిపాల్, కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, కోడూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి



షాద్‌నగర్ : అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్, తదితరులు

కేశంపేట : పోమాల్‌పల్లి, కాకునూర్‌లో అమృత సరోవర్ చెరువుల వద్ద, ఉపాధిహామీ కూలీలతో ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి రాజ్యాంగ పీఠికను చదివి వినిపించి, ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీవో కిష్టయ్య, ఏపీవో అజీజ్ అహ్మద్, టీఏ నీలకంఠ బాబు, చంద్రారెడ్డి, జగన్ ఉన్నారు.మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠకను చదివి ప్రతిజ్ఞ చేశారు. మండల కన్వీనర్ మహిపాల్, రాష్ట్ర పెయింటింగ్ ఇన్‌చార్జి మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు దిగుతుండగా జారిపడి..
మహిళ దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైలుదిగుతూ ప్రమాదవశాత్తు కిందపడి మహిళ మృతిచెందిన విషాద ఘటన సోమవారం అర్ధరాత్రి షాద్‌నగర్ రైల్వేస్టేషన్ చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం మేరకు.. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం వెల్మాల్‌కు చెందిన సురేష్, ఆయన భార్య ఉమ(33) కుమారులు, కుమార్తెతో కలిసి పట్టణంలోని న్యూరాఘువేంద్ర కాలనీలో నివాసముంటున్నారు. సురేష్ మొగిలిగిద్ద శివారులోని ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. వారం క్రితం స్వగ్రామంలో శుభకార్యం ఉండటంతో కూతురుతో కలిసి ఉమ వెల్మాల్‌కు వెళ్లింది. సోమవారం తిరుగు ప్రయాణంలో నిజామాబాద్ నుంచి కాచిగూడ వరకు రైలులో వచ్చి అక్కడి నుంచి గుంటూరు ప్యాసింజర్ రైలులో షాద్‌నగర్ బయలుదేరింది. షాద్‌నగర్ రైల్వేస్టేషన్‌కు రాగానే రైలు దిగబోయి కాలుజారి కింద పడిపోయింది. రైలు ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కుపోవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. స్టేషన్ మాస్టర్ మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

టీడీపీకి పూర్వవైభవం తేవాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాదిలాల్

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అండేకార్ యాదిలాల్ పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కోశాధికారి అర్జుం నర్సింహ, వాణిజ్యసెల్ రాష్ట్ర కార్యదర్శి కండె సత్యనారాయణలతో కలిసి సభ్యత్వ నమోదును యాదిలాల్ ప్రారంభించారు. జిల్లా, మండల నాయకులు ఎన్డీ పంచాక్షరి, ఖాదర్, గాజుల పద్మనాభం, సురమల్ల సత్తయ్య, వెంకటేశ్, శీలం వెంకటయ్య, వజ్రలింగం, సింహయ్య, కాలె శివ, జంగయ్యగౌడ్, పూసల వెంకటేశ్, అనిల్, తదితరులున్నారు.

పేదల విద్యాభ్యున్నతికి పెద్దపీట



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఖానాపూర్‌లో ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ మండలం కేంద్రంలో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఎం రేవంత్, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, నియోజకవర్గ సోషల్‌మీడియా ఇన్‌చార్జి అజీం, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేస్తాం



కేఎల్లార్ సమక్షంలో పార్టీలో చేరుతున్న ఉద్యమకారులు

కందుకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు పూర్తి న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఉద్యమకారులు మాజీ జడ్పటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డిల ఆధ్వర్యంలో కేఎల్లార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమాజాన్ని నమ్మించి మోసంచేసిన ఘనుడు కేసీఆర్ అని అన్నారు. ఉద్యమకారులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, మేధావులను నట్టేట ముంచి గద్దెనెక్కి.. తెలంగాణ ఆశయాలను తుంగలో తొక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, నాయకులు నర్సింహాచారి, కాంగ్రెస్‌లో చేరిన ఉద్యమకారులు రమేష్‌చారి, గుండ్లపల్లి రాములు, పద్మ, అమృత, పి.నర్సింహ, భాషాగౌడ్, జి.రవి, జంగయ్య, తదితరులున్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై అభ్యంతరాలుంటే తెలపాలని ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. ఆమనగల్లు మండలంలోని 13గ్రామ పంచాయతీల పరిధిలో గతంలో ఉన్న 14,407 ఓటర్లకు అదనంగా 224 కొత్త ఓటర్లు చేర్చి వార్డులవారిగా కేటాయించినట్లు చెప్పారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మంగళవారం కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై మండల పరిధిలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు.

కడ్తాల్ : కడ్తాల మండల పరిషత్‌కార్యాలయంలో ఎంపీడీవో సుజాత అధ్యక్షతన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. 24 జీపీల పరిధిలో కొత్తగా 882 ఓట్లు చేర్పినట్లు తెలిపారు. నాయకులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, బీక్యనాయక్, హన్మనాయక్, బీచ్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : ఈ నెలాఖరుకల్లా తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని, అభ్యంతరాలుంటే తెలపాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీవో శ్రీలత, కార్యాలయ పర్యవేక్షణాధికారి శైలజ, బీఆర్ఎస్ నాయకుడు ఖాజుద్దీన్, సీపీఎం నుంచి బ్రహ్మయ్య, చందూనాయక్ తదితరులున్నారు.

కేశంపేట : మండలంలో మొత్తం 35,862 మంది ఓటర్లుగా ఉన్నారని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. రాజకీయ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీవో కిష్టయ్య, కాంగ్రెస్, బీజేపీ, మండలాధ్యక్షులు వీరేశ్, రఘురాములుగౌడ్, డీఎస్పీ కన్వీనర్ మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు తలసాని వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

119 మందికి కంటి ఆపరేషన్లు

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు శ్రీలక్ష్మీగార్డెన్‌లో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో భాగంగా మంగళవారం 119 మందికి కంటి ఆపరేషన్లు చేశారు. చెన్నై శంకరన్ నేత్రాలయం సహకారంతో టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో ఇప్పటివరకు 4500 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 3000 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేసినట్లు చైర్మన్ రాఘువేందర్ రెడ్డి తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్, శ్రీను, కొండల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించాలి

చేవెళ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు తగిన వైద్యసదుపాయాలు కల్పించాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సీపీఎం నాయకులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు ఎలాంటి సదుపాయాలు లేవని, వైద్యులు సక్రమంగా అందుబాటులో ఉండటం లేదన్నారు. రాత్రి సమయంలో ఒక్క వైద్యుడు కూడా అందుబాటులో లేకపోవడం సరైందన్నారు. అందుబాటులో లేని వైద్యులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.

పుదీనా@మల్కాపూర్

(5వ పేజీ తరువాయి)

ఈ గ్రామ రైతులు పండించిందే ఉంటుంది. డిమాండ్‌ను బట్టి పుదీనా మూట రూ.1,500 నుంచి రూ.2వేల వరకు పలుకుందని రైతులు పేర్కొంటున్నారు. నెలకు ఖర్చులుపోను రూ.10వేల వరకు ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

ఏడాది పొడువునా సాగు

మల్కాపూర్ గ్రామంలోని రైతులు ఏడాది పొడువునా పుదీనా పంటను సాగు చేస్తుంటారు. సాగు వ్యవసాయ బోరు, బావుల కింద స్ప్రింకర్లతో సాగుచేస్తుంటారు. గ్రామంలోని ప్రతి ఇంటికి అర ఎకరం నుంచి మూడు ఎకరాల వరకు పుదీనా పంట ఉంటుంది. ఎకరాకు పెట్టుబడి రూ.20 వేల నుంచి 30 వేల వరకు ఖర్చు అవుతుందంటున్నారు. అయితే ఒక్కసారి పంట వేస్తే మూడు సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. గ్రామంలో ఎక్కువ మంది రైతులు ఆకుల కూరలనే సాగు చేస్తుంటారు. నిత్యం గ్రామం నుంచి వందల సంఖ్యల్లో పుదీనా మూటలు మార్కెట్‌కు తరలించి ఉదయాన్నే అమ్ముకుని ఇంటికి తిరిగివస్తుంటారు. పుదీనా పంట 40 రోజుల్లో చేతికి వస్తుంది. పండగ పబ్బం అనే తేడా లేకుండా రైతులు పంటను ధర ఉన్నా లేకపోయినా మార్కెట్‌కు తరలిస్తుంటారు. పెళ్లిళ్ల సీజన్‌లో ఒక్క పుదీనా కట్ట రూ.5 నుంచి 10 వరకు పలుకుతుంది. పుదీనా సాగు కోసం ఒకొక్క రైతు లక్షల్లో ఖర్చుచేసి బోర్లువేసి పంటను సాగు చేస్తున్నారు.

ప్రత్యేక రోజుల్లో భారీగా డిమాండ్



పుదీనా పండించేందుకు లక్షల్లో ఖర్చు చేసి బోర్లు వేసి పంట పండిస్తున్నాం. అయితే ఇతర పంటలతోపాటు పుదీనా పంట మాత్రం తప్పని సరిగా సాగు చేస్తున్నాం. రెండు ఎకరల్లో సాగు చేశాను. ప్రతీ రోజు మార్కెట్‌కు పూదిన కోసి తరలిస్తున్నాం. పెట్టుబడి పోను మంచి లాభాలు వస్తున్నాయి. ప్రత్యేక రోజుల్లో మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉంటుంది.

- బంటు శివరాజ్, యువ రైతు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడ్తాల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో సుజాత అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం మన ఊరిలో పనుల జాతరలో భాగంగా ఈజీఎస్ ద్వారా రైతు రాయ కంటి భిక్షపతికి మంజూరైన జామ తోట పనులను ఎంపీడీవో ప్రారంభించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, తదితరులున్నారు.



కేశంపేట : చౌలపల్లిలో ఉపాధి కూలీని సన్మానిస్తున్న ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి

చేవెళ్ల : మండల ఇన్‌చార్జి ఏపీవో రాజశేఖర్ సమక్షంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మన ఊరిలో పనుల జాతర కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో అమృత్ సరోవర్ చెరువుల వద్ద ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులతో ఉపాధి కూలీలు, అధికారులు కలిసి రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కువ పని దినాలు చేసిన కూలీలను సన్మానించారు. అధికారులు తదితరులున్నారు.

కేశంపేట : మండల అభివృద్ధి అధికారి రవిచంద్రకుమార్ రెడ్డి గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించారు. చౌలపల్లిలో మైసమ్మ గుడి నుంచి అంజనేయస్వామి ఆలయం వరకు రోడ్డు పనులు ప్రారంభించారు. ఎంపీవో కిష్టయ్య, ఏపీవో తదితరులున్నారు.

యాచారం : ఏపీవో లింగయ్య, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డిలు మండలంలోని గ్రామాల్లో ప్రజా విజయోత్సవం, అమృత్ సరోవర్ అంశంపై రైతులు, ఉపాధిహామీ అధికారులతో ప్రతిజ్ఞ చేశారు. మల్కీజ్‌గూడ, చింతపట్ల, మేడిపల్లి తదితర గ్రామాల్లో పశువుల దొడ్ల నిర్మాణం కొరకు భూమిపూజ చేశారు.

సంక్షిప్తంగా

● **కేశంపేట** : ప్రజల డైరెక్షన్‌లో పనిచేసే ఏకైన పార్టీ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)నే అని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి డొడ్డి శ్రీనివాస్ అన్నారు. కాకునూర్‌లో మంగళవారం జన కల్యాణ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు సామాన్య ప్రజల నుంచి పార్టీ కోసం విరాళాలు సేకరించారు. షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు సొంటే శ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షుడు జగన్, నాయకులు గండేటి నర్సింహ, పి.లింగం, ఆంజనేయులు, శరత్, గోపని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● **షాద్‌నగర్ అర్బన్** : ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మించి, పూజలు ప్రారంభించిన ఆంజనేయస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన పోలేమోని చంద్రయ్య ఆయన కుమారులు రాము, వినయ్‌లు రూ.లక్షా వెయ్యి విరాళంగా ఇచ్చారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేష్‌గుప్త, ఆన్మారి వెంకటయ్యలు అభినందించారు.

● **కడ్తాల్** : అధైర్య పడొద్దు అండగా ఉంటానని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ బాధిత కుటుంబాలకు మనోధైర్యం కల్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల మృతిచెందిన కేశని సత్యమ్మ, బాబ్రి, సందీప్‌రెడ్డి, శ్రావ్యల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ.20వేలు అందజేశారు. హరిచంద్ నాయక్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● **ఆమనగల్లు** : స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అమలు చేయాలని తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ కోరారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు రాష్ట్ర బడ్జెట్‌లో 50 శాతం నిధులు బీసీల సంక్షేమానికి కేటాయించాలని, చట్టసభలలో బీసీల రిజర్వేషన్లు పెంచాలని, బీసీ పిల్లలకు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, బీసీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నరేశ్, గణేశ్, రమేశ్‌గౌడ్, నరేశ్‌గౌడ్, తదితరులున్నారు.

● **తలకొండపల్లి** : మండలాన్ని సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 26వ రోజుకు చేరాయి. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ మొకురాల అశోక్‌గౌడ్ కోరారు. వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, నాయకులు కృష్ణయ్య, రమేశ్, నిరంజన్, తదితరులున్నారు.

● **మాడ్గుల** : పత్తి 8నుంచి 12 వరకు తేమశాతం కలిగి ఉంటే మద్దతు ధర లభిస్తుందని వ్యవసాయాధికారి అరుణకుమారి తెలిపారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి సమీపాన ఉన్న కాటన్‌మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఏఈవో జ్యోస్నా, వాహిని, సీసీఐ అధికారి లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

● **ఆమనగల్లు** : ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన అజీమ్ ఏఐసీసీ కార్యదర్శి సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వంశీని పూలమాలలు శాలువాలతో సత్కరించారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం రైతులకు వారధిగా పని చేయాలని వంశీచందర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, మైనార్టీ నాయకులు ఆరిఫ్ తదితరులున్నారు.

● **కందుకూరు** : మహేశ్వరం నియోజకవర్గాన్ని ప్రపంచస్థాయి పట్టణాలకు దీటుగా పోటీపడేలా నిర్మాణం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపనలు చేయడం సరికాదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, గణేష్ నాయఖలతో కలిసి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహేశ్వరం, కందుకూరు మండలాలను మున్సిపాలిటీలుగా చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు తయారుచేస్తుంటే బీఆర్ఎస్ నేతలు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.

● **చౌదరిగూడ** : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు విషయం ఏమైందో చెప్పాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు నర్సింహులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లేడ్ చౌదరిగూడలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదకొండు నెలలు కావస్తున్నా హామీల అమలు చేయడంలో విఫలమైందన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను విమర్శించేముందు కాంగ్రెస్ నాయకులు మండలంలో ఏం అభివృద్ధి పనులు చేశారో తెలుసుకొని మాట్లాడాలన్నారు. అంజయ్యయాదవ్ చేసిన అభివృద్ధి ఏంటో కాగితాలతో చూయిస్తామని.. చర్చకు సిద్ధమేనా? అని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నాయకులు మాణయ్య, మోత్యానాయక్, హరినాయక్, రాములు ఉన్నారు.

● **కందుకూరు** : డయాబెటిస్‌ను నిర్లక్ష్యం చేయకూడదని, వైద్యులను సంప్రదించి రోజువారిగా మందులు వాడాలని లయన్స్‌క్లబ్ జిల్లా మొదటి వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మండల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. విఠల్‌రెడ్డి మాట్లాడారు. క్యాంపులో 90మందికి స్క్రీనింగ్ చేయగా 8మందికి కొత్తగా డయాబెటిస్ బయటపడిందని చెప్పారు. ఈ సందర్భంగా రక్తపోటు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇవ్వడం జరిగిందన్నారు. క్లబ్ కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తా, తాళ్ల అంజయ్య, నిమ్మ అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.